Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 344 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :344 | సోమవారం 15 డిసెంబర్ 2025 | వెల : 3 | ే ఎజీలు : 4

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

### హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చూపితే

# కఠిన చర్యలు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆరాలి గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించండి

జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫోన్ లో మంత్రి ఆదేశం

హాస్టల్ ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపై ఎందుకు వచ్చారు...?

బాధ్యులపై చర్యలు తీసుకోండి : మంత్రి సవిత



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తో మంత్రి ఫోన్ మాట్లాడుతూ, హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుకు పైగా రావడానికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు - మిగతా3లో



## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ నియామకం
- నియామకాన్ని ఖరారు చేసిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు
- ప్రస్తుతం బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్
- వెంటనే నియామకం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిన పార్టీ
- జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో పార్టీలో మార్పులు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవజ్ఞుడైన నేత

### డిసెంబర్ 25న అమరావతిలో

# బహిరంగ సభ



- మదనపల్లెలో వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి
- అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి
- వాజ్‌పేయి ఆశయాలను ప్రధాని మోదీ ముందుకు తీసుకెళుతున్నారని వ్యాఖ్య

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తిరుపతి**

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదివారం ఆవిష్కరించారు. బీజేపీ చేపట్టిన 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర'లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.
మాజీ భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శాలను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కొనియాడారు. పదవుల కంటే ప్రజల సేవే ముఖ్యమని వాజ్‌పేయి జీవితం నేర్పిందని, - మిగతా3లో

## కేంద్రం,ఈసీపై రాహుల్ గాంధీ ఆగ్రహం

- 'ఈసీ బీజేపీ కుమ్మక్కయ్యి వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారు
- ఓట్ చోరీపై దేశ వ్యాప్తంగా 5.5కోట్ల మందికి పైగా సంతకాలు సేకరించాం
- ఓట్‌చోరీపై అందరూ ఏకమవ్వాలి
- ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు జోడించారు




## ఓట్ చోరీ ద్రోహులను గద్దె దింపాలి

- ఓట్ చోరీకి పాల్పడేవారు ద్రోహులు
- ఓటింగ్ హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే అలాంటి వారిని అధికారం నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది
- కాంగ్రెస్ పార్టీ ఒక్కటే దేశాన్ని కాపాడగలదు
- సమష్టిగా కాంగ్రెస్ సిద్ధాంతాన్ని బలపరచాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉంది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే





## ఆస్ట్రేలియాలో ఉగ్రదాడి..

- షూటర్‌ను ఒంటిచేత్తో ఎదుర్కొన్న సామాన్యుడు...
- ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఉగ్రవాదుల కాల్పుల కలకలం
- 10 మంది మృతి, 29 మందికి తీవ్ర గాయాలు
- తుపాకీతో కాల్పులు జరుపుతున్న షూటర్‌ను అడ్డుకున్న సామాన్య పౌరుడు
- యూదుల పండుగను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందని ప్రకటన



### రైతులకు అన్యాయం

## జరిగితే ఊరుకోం

24 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ

మంత్రి కొలుసు పార్థసారథి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం**

రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేసి ఎక్కడ లేని విధంగా 24 గంటల్లో పైకం చెల్లిస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి జన్మదిన వేడుకలలో భాగంగా తొట్ల వల్లూరులో ప్రభుత్వ వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తాను రైతు బిడ్డ అని, రైతుల కష్టాలు తెలుసని, రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతోనే తాను శనివారం కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. శనివారం జరిగిన సంఘటనను వివరిస్తూ మంత్రివర్యులు కొంతమంది రైతులు రైస్ మిల్లర్ల నుండి తడిసిన ధాన్యం - మిగతా3లో

# టిడ్కో ఇళ్లకు తుది మెరుగులు

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

టిడ్కో ఇళ్లు పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు

జూన్ నాటికి లబ్ధిదారులకు ఇళ్లు అందజేసేలా అడుగులు

ప్రభుత్వ చర్యలతో సొంతింటి కల నెరవేరుతుందని హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

పేదల సొంతింటి కల సాకారం చేసేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టీడీపీ హయాంలో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు అంచనాలు రూపొందించింది. కృష్ణా జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.1000 కోట్ల వ్యయంతో నిర్మాణం: కృష్ణా జిల్లాలో రూ.1000 కోట్ల వ్యయంతో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. మచిలీపట్నంలో 2,304, గుడివాడలో 8,912, ఉయ్యూరులో 2,496 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ప్రాంతాల్లో సుమారు 70 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. వైఎస్సార్సీపీ హయాంలో టిడ్కో - మిగతా3లో



## ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం

- పాకిస్థాన్ ఉగ్రవాది నోటి దురుసు!
- లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు
- జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదు
- వివాదం మరింత తీవ్రమవుతుంది

## కేరళ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో
# ఎస్ డిపిఐ పార్టీ 102 స్థానలలో ఘన విజయం



**పలమనేర్, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్14:**
కేరళలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎస్‌డిపిఐ పార్టీ 102 స్థానాల్లో ఘనవిజయం సాధించడంతో పలమనేరు పట్టణంలో ఎస్డిబిఐ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు ముబా రాక్,కార్యదర్శి మహబూబ్ చిత్తూరుజిల్లా కార్యవర్గ సభ్యులు సులేమాన్ ఆధ్వర్యంలో స్థానిక (ఎస్ డిపిఐ)పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా (ఎస్ డి పి ఐ) పార్ట చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రోషన్ మాట్లాడుతూ.. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్ డిపిఐ) పార్టీ కేరళ రాష్ట్రంలో ఎలాంటి కూటమి లేకుండా స్వతంత్రంగా పోటీ చేసి102 స్థానాలు గెలుచుకోవడం,ద్వారా ఒక చారిత్రాత్మక రాజకీయ మైలురాయిని సాధించింది. ఈ ఘన విజయం పార్టీ యొక్క తయారవుతుందని అభిప్రాయపడ్డారు.

# నేటి నుంచి మండలంలో ఉలవలు పంపిణీ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
చౌడేపల్లి మండలంలో ఈనెల 15 నుంచి ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఉలవలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. మండలానికి ప్రభుత్వం200 క్వింటాళ్లు ఉలవలు ప్రత్యామ్నాయ పంటగా కేటాయించింద న్నారు. రైతు సేవా కేంద్రాల్లో 10 కిలోల ఉలవలు ప్రభుత్వ సబ్సిడీ 80% పోను రూ 112 లు చెల్లించి తీసుకెళ్లాలన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అధికారు లకు ఇచ్చి ఉలవలను పొందవచ్చునన్నారు.

# పూర్వపు నేస్తాల అపూర్వ కలయిక



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
పూర్వపు నేస్తాలు కలయిక అపూర్వంగా జరిగింది. చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో 1993-94 శక్తి క్షేత్రం బోయకొండలో కలుసుకున్నారు. అమ్మవారి దర్శనం చేసుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకున్నారు. సమాజంతోపాటు తమ సమూహంలో ఉన్న స్నేహితులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించే విధంగా చర్చించుకున్నారు. ముఖ్యంగా విద్య వైద్యం పట్ల సమస్యలు ఉంటే పరిష్కరించుకునే మార్గాలను అన్వేషించారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకుని పూర్వం స్నేహపు విషయాలను నెమరు వేసుకున్నారు ఈ కార్యక్రమంలో చౌడేపల్లి ఉన్నత పాఠశాల 1993-94 పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయ విశిష్టతను
# ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రికి వివరించిన
## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్14 :**
శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి,పరశురామేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బత్తల గిరిబాబు ఆదివారం రేణిగుంటలోని వాజ్పేయి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయ చారిత్రక,ఆధ్యాత్మిక విశిష్టతను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికు వివరించారు.అలాగే ఆలయ విశిష్టతను వివరించే ప్రత్యేక పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ భేటీ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ధార్మిక ప్రాధాన్యతపై సానుకూల చర్చ జరిగింది.

## శ్రీపరశురామేశ్వర స్వామి దేవస్థానంలో
# నూతన పాలకమండలి ఏర్పాటు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్14 :**
శ్రీపరశురామేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నూతన పాలకమండలి ఏర్పాటు జరిగింది. నూతన పాలకమండలి చైర్మన్‌గా బత్తల గిరిబాబు (గిరి నాయుడు) నియామకమయ్యారు. పాలకమండలి సభ్యులుగా బాబు, అరుణ, హంస, గీత, రాజ్‌కుమార్, కిరణ్ కుమార్, రేవతి, నిరంజన్, ఉషా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఫణి రాజసయన, మండల అధ్యక్షులు నాగరాజు నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు నూతన పాలకమండలి సభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిదర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

# రేణిగుంటలో ఘనంగా అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహావిష్కరణ
## భారతదేశం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది.. పుష్కర్ సింగ్ ధామి







**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14 :**
భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి శత జయంతి సందర్భంగా ఆదివారం రేణిగుంట హైవేలోని మర్రిగుంట కూడలిలో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్పేయి గారి విగ్రహాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్పేయి అజాతశత్రువు, మానవీయ విలువలతో పాలన సాగించిన మహానాయకుడని కొనియాడారు. ప్రజలే ముఖ్యమని నమ్మిన నాయకుడిగా ఆయన దేశాభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. గ్రామ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజి, టెలికాం విప్లవం వంటి పథకాలు ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ నేడు ఆత్మనిర్భర్ భారత్ దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. స్టార్టప్‌లు, డిజిటల్ విప్లవం, మౌలిక సదుపాయాల అభివృద్ధితో భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. చంద్రయాన్-3, ఆదిత్య-1 వంటి విజయాలు భారత శాస్త్రీయ సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రశంసించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో తిరుపతి ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు చామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటి పెరటిలో పెరిగిన 16 కేజీల నేల గనుసు గడ్డ



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
వి.కోట పట్టణంలో కాపురం వున్నా విశ్రాంత ఉపాధ్యాయిని డాక్టర్ జి.శాంతకుమారికి మొదటి నుండి పెరటితోట పెంపకం చాలా మక్కువ. ఆ మక్కువ తోనే (కొయ్యగెనిసి )కర్రను పెరట్లో నాటారు. నీరు పెట్టడంతో పాటు అప్పుడప్పుడు సేంద్రియ ఎరువును అన్ని మొక్కలకు వేయ డం జరిగింది. ఒక సంవత్సరం తర్వాత తర్వాత చెట్టు బాగా ఏపుగా పెరిగింది. క్రింది నేల కొద్దిగా పగులురావడం గమనించి మొక్క ను పెకలించి చూడగా భూమి లోపల బాగా ఊరిన కొయ్య గెనిసి గడ్డలు ఉండటం. ఒకింత ఆశ్చర్యం చెందారు. ఈ అరుదైన చెట్టు గణసు గడ్డ సుమారు అన్నీ కలిపి 16కేజీలు పైగా ఉన్నవి. మా తోటలో పండటం ఇదే మొదటి సారి అని వివరించారు. దానినిముక్కలు చేసి చుట్టుపక్కల వారికి, బందువులకు కూడా పంచడం జరిగిందని అనందం వ్యక్తం చేశారు.

## కుప్పం నియోజకవర్గ
# మైనార్టీ విభాగ అధ్యక్షులుగా జాకీర్ అహ్మద్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులుగా జాకీర్ అహ్మద్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా కుప్పం పట్టణంలో మైనార్టీ నేతలు, కార్యకర్తలు జాకీ అహ్మద్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ తనపై ఎంతో నమ్మకంగా ఇచ్చిన పదవికి పూర్తిస్థాయి న్యాయం చేస్తానని, ఇంతటి బాధ్యతను తమకు అప్పగించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ,టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుప్పం ప్రజ్ఞా స్కూల్‌లో
## ఇన్‌ఆగ్రేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా
## ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిల్లల భవిష్యత్తు సూచనలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
కుప్పం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞా స్కూల్‌లో జరిగిన ఇన్‌ఆగ్రేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని, పిల్లల భవిష్యత్తు అవకాశాలపై మార్గదర్శక సూచనలు అందజేశారు. స్కూల్ యాజమాన్యం యూజిన్, న్యాన్సీ, రీటా, ప్రిన్సి, రాజీవ్, మున్సిపల్ చైర్మన్ సెల్వం, డైరెక్టర్లు శివ, 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, రాజారాం, వేణు, తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్య, క్రీడలు, నైతిక విలువలపై శ్రీకాంత్ ప్రత్యే కంగా స్పందించారు. ఈ కార్యక్రమం పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు నాయకుడు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీ ఎన్నిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, పీకే ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు చొరవతో, కడ అడ్వైజర్ రాజ్ కుమార్, కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షుడు జాకీర్, షాది మహల్ చైర్మన్ సర్దార్ భాష, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ జనరల్ సెక్రెటరీ నబి ఆధ్వర్యంలో మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది, మున్సిపల్ మైనారిటీ నూతన అధ్యక్షుడిగా ఉమర్ ఖాన్, ఉపాధ్యక్షులుగా జావిద్, ఇస్మాయిల్, జనరల్ సెక్రెటరీ మహబూబ్ బాషా, ఆర్గనైజర్ సెక్రెటరీగా మక్బూల్ బాషా, ఇస్మాయిల్, సమీర్, సెక్రటరీలుగా జహీర్ అహ్మద్, సలీం, జావిద్,సయ్యద్ ఫయాజ్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మైనార్టీ సెల్ నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పార్టీ తమ పై ఎంతో నమ్మకంగా ఇచ్చిన పదవికి పూర్తిస్థాయి న్యాయం చేస్తామని, ఇంతటి బాధ్యతను తమకు అప్పగించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రేస్ మేరియా ట్రస్ట్‌పై గుడిపల్లి
# కేజీబీవీలో అవగాహన కార్యక్రమం



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని గ్రేస్ మేరియా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు చెందిన సిబ్బంది. గుడిపల్లి కేజీబీవీ హాస్టల్‌లో ఆడవాళ్ళపై జరిగే అకృత్యాలను అరికట్టడానికి, బాలికల హక్కుల గురించి మైమ్‌రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టీ ఆరోగ్యరాజ్‌కు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టీ మేనేజర్ జేసు మేరీ, కేజీబీవీ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. సమాజంలో ఆడవాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలను మైమ్‌ల ద్వారా ప్రదర్శించి, బాలికల రక్షణ, హక్కుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమం హాస్టల్ విద్యార్థినులకు మేల్కొల్పుగా మారిందని నిర్వాహకులు తెలిపారు. స్థానికంగా ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా జరిగితే సమాజంలో అవగాహన పెరుగుతుందని ఆరోగ్యరాజ్ అభిప్రాయపడ్డారు.

# శ్రీసత్యమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యుల సమావేశం.



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 14:**
అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం గండబోయినపల్లి శ్రీసత్యమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యుల సమావేశం ఆలయకమిటీ అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యమ్మ తల్లికి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సద్దల చక్రపాణి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న నిలువెత్తు అమ్మవారి విగ్రహ ఆవిష్కరణ ఆలయంలో నవగ్రహ విగ్రహాలు ప్రతిష్టాపన ఆలయరాజగోపుర పనులు అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సమావేశంలో సభ్యులు అమరనాథ్ రెడ్డి రమేష్ డీలర్ సత్యనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి సత్యారెడ్డి పూజారి ఉత్తన్న స్వామి కృష్ణప్ప పాల్గొన్నారు.

APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

# టిడ్కో ఇళ్లకు తుది మెరుగులు

-మొదటిపేజీ తరువాయి

ఇళ్ల నిర్మాణం అటకెక్కటంతో లబ్ధిదారుల ఆశలు ఆవిరయ్యాయి. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించకపోగా కొన్ని నిర్మాణాలను పునాదుల్లోనే నిలిపివేశారు.

%గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు: గుడివాడలో 8,912 ప్లాట్లకు గాను 7,198 మందికి ఇళ్లు కేటాయించారు. వివిధ కారణాలతో 1,0774 ప్లాట్లు పెండింగ్‌లో పెట్టారు. ఉయ్యూరులో 2,496 ప్లాట్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇళ్ల కోసం లబ్ధిదారులు అప్పులు చేసి మరీ డిపాజిట్లు చెల్లించినా ఫలితం లేకపోవటంతో గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు: కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది 2026 జూన్ నాటికల్లా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఏ ఏ ప్రాంతాల్లో ఏ స్థితిలో ఇళ్లు ఉన్నాయి? వాటి పూర్తికి ఎంత బడ్జెట్ అవసరం తదితర అంశాలతో పూర్తి నివేదికను అధికారులు సిద్ధం చేశారు. హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు: గుత్తేదారు సంస్థ సిబ్బంది టిడ్కో నివాసాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు ఇంటి లోపల పెయింటింగ్ పనులను ప్రారంభించారు. విద్యుత్ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన డ్రైనేజీ, మంచినీటి వసతి, రోడ్డు వసతుల కల్పనపై గుత్తేదారు సంస్థ దృష్టి పెట్టింది. టిడ్కో నివాసాల్లో పనులు జరుగుతుండంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "గత టీడీపీ హయాంలో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను తర్వాత



అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ పూర్తిచేయకుండ మమ్మల్ని మభ్యపెట్టింది. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదలకు అందజేసేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నందుకు ప్రభుత్వానికి మా అందరి తరపున కృతజ్ఞతలను తెలియజేస్తున్నాం"-లబ్ధిదారులు

# అమరావతికి అడ్డంకులు క్లియరైనట్టేనా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించిన బిల్లును తిరిగి పంపించిందని కూడా వార్తలు వస్తున్నాయి. న్యాయపరమైన చిక్కులు, నిధులు సమస్యల కారణంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇంకా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని ఎప్పుడైనా బిల్లు ఆమోదం పొందవచ్చని అంటున్నారు. మొత్తానికి ఈ వార్త ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌గా నోటిఫై చేయించుకుంటే భవిష్యత్‌లో మార్పులు చేర్పులకు అవకాశం ఉండని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర విడిపోయిన తర్వాత కమిషన్ వేసి అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది నాటి టీడీపీ ప్రభుత్వం. అయితే జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాజధానిగా పెట్టేందుకు అంగీకరించలేదు. దీంతో మూడు రాజధానులు అంటూ సరికొత్త పల్లవి అందుకున్నారు. వివిధ కారణాలతో మూడు రాజధానుల వ్యవహారం కూడా ముందుకు సాగలేదు. తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు రాజధానుల వాదనను ప్రజలు తిరస్కరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని స్పష్టం చేసింది. అక్కడ అభివృద్ధి పనుల కోసం వివిధ ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. కేంద్రం కూడా దీనికి ఓకే చెప్పింది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మళ్లీ మార్చకుండా ఉంటాయా అనే అనుమానం ఉంది. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు కేంద్రమే ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా నోటిఫై చేయాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం బిల్ పంపించింది. 2014 నుంచి గుర్తించాలని పేర్కొంది. ఇలా చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేంద్రం భావిస్తుందని అంటున్నారు. 2024 నుంచి గుర్తిస్తే అప్పటి వరకు చేసిన ఖర్చులపై కూడా న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పటికే పంపిన బిల్లును తిరిగి వెనక్కి పంపించారని అంటున్నారు. ప్రత్యామ్నాయాలతో బిల్లు పంపించాలని సూచించినట్టు చెబుతున్నారు. తిరిగి వచ్చిన బిల్లుపై చంద్రబాబు సర్కారు న్యాయనిపుణులతో చర్చిస్తోందని



అంటున్నారు. దీనికి పరిష్కార మార్గాలను కనుక్కునే పనిలో ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పూర్తి అయ్యే లోపుపంపిస్తే కేంద్రం అంగీకరించి సభలో ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. లేకుంటే మళ్లీ బడ్జెట్ సమావేశాల వరకు ఎదురు చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అటు కేంద్రం నుంచి కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. టీడీపీ వర్గాలు కూడా సైలెంట్‌గా ఉన్నాయి. కేంద్రానికి బిల్లు పంపిన సంగతిని మాత్రం ఇప్పటికే ప్రకటించారు. పీ క్యాబినెట్ మే 19, 2025న అమరావతిని రాజధానిగా గుర్తించే రెజల్యూషన్ ఆమోదించి, కేంద్రానికి పంపింది. ఈ రెజల్యూషన్‌లో 2014-2024 వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న విషయాన్ని పేర్కొంటూ, 2024 తర్వాత అమరావతిని ఏకైక క్యాపిటల్‌గా చట్ట చేయానలని కోరుతున్నారు. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లుగా తెలుస్తోంది. కేంద్రం 2014 చట్టం సెక్షన్ 5(2)ను సవరించే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బిల్లు అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ, భవిష్యత్ ప్రభుత్వాలు రాజధాని మార్చకుండా రక్షణ ఇస్తుంది. అయితే, రెట్రోస్పెక్టివ్‌గా 2014 నుంచే అమరావతిని గుర్తించాలా లేక 2024 నుంచా అనే టెక్నికల్ ఇష్యూస్ వల్ల ఆలస్యమవుతోంది. యూనియన్ లా మినిస్ట్రీ డ్రాఫ్ట్ బిల్లుపై కొన్ని ప్రశ్నలు లేవ ని, సరైన లీగల్ జస్టిఫికేషన్‌తో మళ్లీ సమర్పించమని చెప్పింది.నవంబర్ 22, 2025న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోం మంత్రి అమిత్ షాతో చర్చించారు. డ్రాఫ్ట్ బిల్లు యూనియన్ లా డిపార్ట్‌మెంట్ పరిశీలనలో ఉంది. ఈ బిల్లు యూనియన్ క్యాబినెట్ ముందుకు రానుందని, తదుపరి పార్లమెంట్ సెషన్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో బిల్లు చర్చించిన తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని అధికారుల అంచనా.

# ఆ రెండు జైళ్లు వీఐపీలు

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని రెండు ప్రధాన కారాగారాలు?విజయవాడ జిల్లా జైలు ,నెల్లూరు సెంట్రల్ జైలు?అనూహ్యంగా ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించిన కేసులు పెరగడం, వాటిలో రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు రిమాండ్‌కు వెళ్లడం వల్ల ఈ జైళ్లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఒకప్పటి వరకు సాధారణ నేరస్తులే ఎక్కువగా ఉండే ఈ జైళ్లలో ఇప్పుడు వీఐపీలు, రాజకీయ నాయకుల రాకపోకలు పెరగడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది.ఇటీవలి కాలంలో నెల్లూరు జైలులో మళ్లీ హల్‌చల్ మొదలైంది. మాచర్లకు చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు సహా పలువురు రిమాండ్ ఖైదీలుగా అక్కడికి చేరుకోవడం చర్చనీయాంశమైంది. అంతకు ముందు నెల్లూరు సెంట్రల్ జైలు పెద్ద కేసుల కోసం ఎక్కువగా వినియోగించబడేది కాదు. విశాఖపట్నం రాజమండ్రి , కడప జైళ్లలోనే ముఖ్య నిందితులను ఉంచేవారు. కానీ తాజాగా నెల్లూరు, విజయవాడ జైళ్లపైనే అధిక భారం పడుతోంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపిన కేసులు?తిరుమల లడ్డూ కల్తీ, ములకలచెరువు నకిలీ మద్యం, లిక్కర్ స్కాం, నెల్లూరులో మహిళా డాన్‌లపై నమోదు చేసిన కేసులు?అన్నీ ఏదో ఒక విధంగా ఈ రెండు జైళ్లకే చేరుతున్నాయి. ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలో కూడా ఈ కేసులు రోజూ హాట్ టాపిక్ కావడంతో జైళ్ల చుట్టూ రద్దీ పెరుగుతోంది. ప్రతిరోజూ నిందితుల రాకపోకలు, విచారణలకు పంపడాలు, కొత్త ఆరోపణలతో రిమాండ్‌కు వచ్చే వారు? ఇలా జైల్లో జరిగిన ప్రతి చిన్న కదలిక కూడా వార్తగా మారుతోంది.నెల్లూరు సెంట్రల్ జైలులో ఇప్పుడు ప్రధాన కేసులకు సంబంధించిన వ్యక్తులే ఎక్కువ. తిరుమల లడ్డూ కేసులో అరెస్టయిన పది మంది అక్కడే రిమాండ్‌లో ఉన్నారు. మహిళా డాన్‌గా గుర్తింపు పొందిన అరుణ, సీపీఎం హత్య కేసులో నిందితురాలు కామాక్షి కూడా అక్కడే ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ



మంత్రి జోగి రమేష్ , పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాకాణి గోవర్దన్ రెడ్డి వంటి వ్యక్తుల రిమాండ్ కూడా ఇదే జైల్లో కొనసాగింది.ఇక విజయవాడ జిల్లా జైలూ వీఐపీలతో నిండిపోయిన పరిస్థితిలో ఉంది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి), లిక్కర్ స్కాం ప్రధాన నిందితుడు కేసిరెడ్డి రాజశేఖరరెడ్డి , ఎస్పీవై డిస్టిలరీస్‌కు చెందిన సజ్జల శ్రీధర్ రెడ్డి , సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ వంటి వారు అక్కడే ఉన్నారు. గతంలో చిన్న నేరస్తులు ఎక్కువగా ఉండే ఈ జైలు, ఇప్పుడు భారీ సెక్యూరిటీ అవసరమయ్యే వీఐపీలతో నిండి సిబ్బందికి సవాలుగా మారింది. ఈ పరిస్థితులు చూస్తుంటే, ఏపీలో రాజకీయాలు, పోలీసు కేసులు, జైలు వాతావరణం అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి పోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

## హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజ వర్గం ఓడీ చెరువు మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ లో లక్ష్మీనరసింహా తొమ్మిదో తరగతి, భార్గవ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న మండపానికి ప్రసాదం కోసం వంట పాత్రలతో వెళ్లారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఇద్దరు విద్యార్థులను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీ నరసింహా తలకు బలమైన గాయం కావడంతో అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి భార్గవ్ ను కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తో ఫోన్ లో మాట్లాడి, విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలన్నారు. వంట పాత్రలిచ్చి ప్రసాదం ఎవరు తీసుకు రమ్మనారో తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకొచ్చారని డీఎస్సీడబ్ల్యూవో రెడ్డి బాలాజీని మంత్రి ఫోన్ లో ప్రశ్నించారు. తక్షణమే గాయడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సంబంధిత హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం

-మొదటిపేజీ తరువాయి

సంబంధించి నష్టపోతున్నట్లు తన దృష్టికి తీసుకొని వచ్చారన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడడం మాట్లాడటం జరిగిందన్నారు. తన సొంత ఊరు కారకంపాడు నుండి వస్తుంటే పక్క గ్రామం అయిన పెద్ద ముత్తేవి నుండి 3 లారీల ధాన్యం లోడ్ చేసుకుని వెళుతుంటే ఆ లారీలను ఆపి ఎక్కడి నుండి వస్తున్నాయి, ధాన్యం ఎంతకు కొనుగోలు చేశారు అని లారీ డ్రైవర్ను అందులోని వారిని అడిగితే తమకు తెలియదని తాము కేవలం రవాణాకు చెందిన వాళ్ళమని గుడివాడ రైల్వే షెడ్ లో వ్యాగిన్స్ లో లోడ్ చేసుకునేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. ఎవరు కొన్నారు వారిని పిలిపించాలని పక్క గ్రామమే కదా అని వారిని అడిగితే ప్రక్క గ్రామం నుండి వారు వచ్చారన్నారు. నాతో మొదట 1550 అని ఆ తరువాత 1450 రూపాయలకు కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అంత తక్కువకు కొనుగోలు ఎలా చేశారని చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించానన్నారు. వెంటనే గోనెసంచిలో నుండి ధాన్యాన్ని బయటకు తీసి తేమ శాతం పరీక్షించే యంత్ర పరికరాన్ని తెప్పించి పరిశీలించగా 22 శాతం తేమ ఉందన్నారు

అడిగితే ధాన్యం రంగు మారిందని చెప్పారు. అక్కడే ఒక బేరగాడు ఉంటే ధాన్యాన్ని అరచేతిలో వేసుకుని నూరితే లోపల బియ్యం ఎక్కడ రంగు మారలేదన్నారు. బియ్యం అంతా బాగానే ఉన్నా నూక రంగు మారితే మీకు వచ్చే నష్టమేంటని ప్రశ్నించామన్నారు. ఎవరు దీన్ని తక్కువ ధరకు కొనమని చెప్పారని అంటూ రైతు సేవా కేంద్రంలోని సాంకేతిక సిబ్బందిని పిలిపించామన్నారు.

తేమ శాతం పరికరాన్ని అప్పటికప్పుడు తెప్పించామన్నారు. తేమశాతం పరిశీలిస్తే 22 శాతం ఉందని ధాన్యం బాగుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం 17 కంటే ఎన్ని పాయింట్లు ఎక్కువ ఉంటే అన్ని కిలోల బియ్యం తగ్గించుకోవలసి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 5 కిలోల బియ్యానికి కిలో 24 రూపాయల చొప్పున 120 రూపాయలు తగ్గించాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 1450 రూపాయలు కొనుగోలు చేయడం ఏంటని మిల్లర్లతో మాట్లాడటం జరిగిందన్నారు. 1650 రూపాయలు చెల్లిస్తే గాని లారీలను వెళ్ళనివ్వమని గట్టిగా చెప్పడం జరిగిందన్నారు

## డిసెంబర్ 25న అమరావతిలో బహిరంగ సభ



-మొదటిపేజీ తరువాయి

పోక్రాన్ అణుపరీక్షల నుంచి దేశాభివృద్ధి వరకు ఆయన చేసిన ప్రయత్నాలు అపూర్వమని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగు నింపడమే ఆయన లక్ష్యమని గుర్తు చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో అటల్%-%మోదీ సుపరిపాలన యాత్ర బహిరంగ సభలో సీఎం ధామి మాట్లాడారు. వాజ్‌పేయి ఆదర్శాలను కొనసాగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఆత్మనిర్భర భారత్‌ను నిర్మిస్తున్నారని ధామి చెప్పుకొచ్చారు. ఆధునిక విమానాశ్రయాలు, గగన్‌యాన్, చంద్రయాన్, వందే భారత్ రైళ్లతో పాటు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే పాలన సాగుతోందని తెలిపారు. అంతర్జాతీయ సంస్థలతోపాటు ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎస్ఈఆర్‌లు అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు వంటి నిర్ణయాలతో దేశాన్ని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని ప్రధాని మోదీ నడిపిస్తున్నారని ధామి అన్నారు. అయోధ్య రామ మందిర నిర్మాణం, వారణాశి-ఉజ్జయినీ మాస్టర్ ప్లాన్‌లు, కేదార్‌నాథ్-బద్రీనాథ్ అభివృద్ధితో సనాతన ధర్మ పరిరక్షణ గొప్పగా జరుగుతోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో గూగుల్ డేటా సెంటర్, క్వాంటమ్ కంప్యూటింగ్, రక్షణ ఉత్పత్తులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కూటమి పాలనలో తిరుపతి ఆధ్యాత్మిక పవిత్ర క్షేత్రంగా మరింత విరాజిల్లనుందని ధామి అన్నారు. డిసెంబర్ 25న అమరావతిలో బహిరంగ సభ ఉంటుందని సీఎం ధామి ఈ సందర్భంగా ప్రకటించారు.

ఉత్తరాఖండ్ అభివృద్ధిలో కొత్త ఊపిరి పోస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పిన ధామి, లవ్ జిహాద్, మతమార్పిడులు, యూనిఫాం సివిల్ కోడ్‌పై పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చివరగా, ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు కొనుగోలు చేయాలని సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వాజ్‌పేయి శత జయంతి సంవత్సరంలో ఏపీ బీజేపీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని ధామి అన్నారు. వాజ్‌పేయి జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువలు, మానవతావాదానికి ప్రతీకగా నిలిచిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన హయాంలో పోఖ్రాన్ అణు పరీక్షలు, స్వర్ణ చతుర్భుజి రహదారి ప్రాజెక్ట్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, టెలికాం విప్లవం వంటి చరిత్రాత్మక విజయాలు దేశం సాధించిందని గుర్తుచేశారు. జాతీయ ప్రయోజనాలే ముఖ్యమైనప్పుడు రాజకీయ భేదాలను ఎలా అధిగమించవచ్చో సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపి నిరూపించారని తెలిపారు. వాజ్‌పేయి ఆశయాలే ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు స్ఫూర్తి అని ధామి పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలతో దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిర్మూలన, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటి నిర్ణయాలు 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' దార్శనికతను బలపరిచాయని వివరించారు.

ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ధామి ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు, రాబోయే పారిశ్రామిక, సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుపై అభినందనలు తెలిపారు. వాజ్‌పేయి స్ఫూర్తితోనే ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడిందని, నేడు ప్రధాని మోదీ మార్గనిర్దేశంలో తమ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు.

## బిజినెస్

### చేతులు కలిపిన మైక్రోసాఫ్ట్, విప్రో




దేశీ ఐటీ దిగ్గజం విప్రో తాజాగా గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఎంటర్‌ప్రైజ్‌లకు ఏఐ సొల్యూషన్లు అందించేందుకు వీలుగా వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీసింది. తద్వారా బెంగళూరులోని పార్ట్‌నర్ ల్యాబ్స్‌లో మైక్రోసాఫ్ట్ ఇన్నోవేషన్ కేంద్రం(హబ్)ను ఏర్పాటు చేయనుంది. మూడేళ్లపాటు అమల్లోఉండే సహకారం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌కు కీలక కార్యకాలపాలలో ఏఐ అమలుకు వీలు కల్పించనుంది. ఒప్పందం ద్వారా విప్రోకున్న కన్సల్టింగ్, ఇంజినీరింగ్ ఆధారిత సామర్థ్యాలకు మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ స్టాక్‌ను జత కలుపుకోనుంది. ఏఐ స్టాక్‌లో భాగంగా అజ్యూర్, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజ్యూర్ ఏఐ ఫౌండ్రీ తదితరాలను భాగం చేసుకోనుంది. వెరసి ఎంటర్‌ప్రైజ్‌లకు కార్యకలాపాలలో టెక్నాలజీ వినియోగానికి వీలుగా విభిన్న ఏఐ సొల్యూషన్లు సమకూర్చనుంది.

### కార్లపై డిస్కౌంట్లే.. డిస్కౌంట్లు..

### రూ 2 లక్షల వరకు ఇస్తున్న ఆటోమొబైల్ సంస్థలు



**న్యూఢిల్లీ :** వాహన కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు డిస్కౌంట్లను తెరపైకి తీసుకొచ్చాయి. రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోతుం డటంతో ఒకవైపు ధరలు పెంచుతున్న సంస్థలు..మరోవైపు పలు మాడళ్లపై భారీగా రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ప్రతియేడాది డిసెంబర్ నెలలో రాయితీలు ప్రకటించే సంస్థలు, డీలర్లు ఈసారి కూడా భారీ స్థాయిలో అందుబాటులోకి తీసుకొ చ్చాయి. తమ వద్ద ఉన్న స్టాక్‌ను క్లియర్ చేసుకోవడానికి డిస్కౌంట్ల రూపంలో అందిస్తున్నాయి. నూతన సంవత్సరంలో నూతన కార్లను మాత్రమే కొనుగోలుదారులకు అందించాలనే ఉద్దేశంతో కొందరు డీలర్లు పాత కారును మాకు ఇచ్చివేయండి..కొత్త కారుతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకండని ప్రకటనలు కూడా విడుదల చేశాయి. దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజాలు ఈసారి ఒక అడుగుముందుకేసి తమ వాహనాలపై రూ.2.4 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రకటించాయి. వీటిలో కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, టాటా మోటర్స్, హోండా, హ్యుందాయ్‌లు పలు మాడళ్లపై డిస్కౌంట్ ఇస్తున్నాయి. ఆర్థిక ప్రయోజనాలలో క్యాష్ డిస్కౌంట్, ఎక్చేంజ్ బోనస్, కార్పొరేట్ ఆఫర్లు, బీమా, విడిభాగాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నాయి. అత్యధికంగా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల లోపు ధర కలిగిన మాడళ్లపై అధికంగా డిస్కౌంట్లు ఇస్తున్నాయి కంపెనీలు.

## దిగుమతి సుంకాలను 50 శాతం పెంచనున్న మెక్సికో..

# స్పందించిన భారత్..!



దిగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచేందుకు మెక్సికో సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మెక్సికో టారిఫ్‌ల పెంపుపై భారత్ స్పందించింది. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరే విధంగా చర్చలు జరుపుతామని భారత్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో తమ ఎగుమతిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే హక్కు ఉందని భారత అధికారి వ్యాఖ్యానించినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇండియా, చైనా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియాతోపాటు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలేని ఇతర ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను పెంచే విషయంలో మెక్సికో గత సెప్టెంబర్‌లోనే సెనెట్‌లో ప్రతిపాదనలు పెట్టింది. అప్పటి నుంచే ఆ దేశంతో భారత్ చర్చలు జరుపుతున్నదని అధికారులు చెబుతున్నారు. అక్కడి భారత రాయబార కార్యాలయం సెప్టెంబర్ 30న ఆర్థిక మంత్రిత్వశాఖ వద్ద ఈ విషయాన్ని లేవనెత్తిందని అన్నారు. కొత్తగా ప్రతిపాదించిన సుంకాల నుంచి భారత ఎగుమతులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. మెక్సికోతో భాగస్వామ్యానికి భారత్ ఎంతో విలువ ఇస్తుందని, ఇరుదేశాల్లోని వ్యాపారులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా స్థిరమైన వాణిజ్యం కోసం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభించేందుకు చూస్తున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే భారత వాణిజ్య విభాగ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్, మెక్సికో ఆర్థిక ఉపమంత్రి లూయిస్ రోసెండో మధ్య మెక్సికో సుంకాలకు సంబంధించి ఉన్నత స్థాయి సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై మరిన్ని సమావేశాలు జరగనున్నట్లు సమాచారం. దేశీయ ఉత్పత్తులను పెంచడంలో భాగంగా చైనా, భారత్ సహా పలు ఆసియా దేశాలకు చెందిన 1400 వస్తువులపై సుంకాలను 50 శాతం పెంచాలని మెక్సికో నిర్ణయించింది. ఈ పెంపు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది.

## తగ్గేదేలేదంటున్న బంగారం ధరలు.. వినియోగదారులకు చుక్కలు



అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును తగ్గించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. దీనికి తోడు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా క్షీణిస్తుండటంతో దేశంలో బంగారం, వెండి ధరలకు రెక్కలొచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,33,910కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,22,750 కు చేరింది. సరఫరా కొరత కారణంగా వెండి ధరలూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో వెండి రూ.1,98,000 వద్ద తచ్చాడుతోంది విలువైన లోహాల ధరల్లో పెరుగుదల.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పులను సూచిస్తోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీన్ని సీజనల్ పెరుగుదలగా, లేదా స్థానిక డిమాండ్‌లో హెచ్చుతగ్గుల పర్యవసానంగా చూడలేమని అంటున్నారు. దీంతో సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంపై ఆందోళన కూడా వ్యక్తం అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ప్రపంచదేశాల మధ్య వాణిజ్యంలో మార్పులు, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై అనిశ్చితి, ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా పసిడి కొనుగోళ్లకు దిగడం వంటి పరిణామాలతో బంగారం ధరలు గత 40 ఏళ్లల్లో ఎన్నడూ చూడని స్థాయిలను చేరుకుంటున్నాయి. ధరలు మునుపటి స్థాయికి దిగొచ్చే అవకాశాలు ప్రస్తుతం తక్కువగా ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు.

## స్పోర్ట్స్

# రికార్డుకు చేరువైన అభిషేక్ శర్మ..

# 87 పరుగులు చేస్తేనే విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టి!




టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ క్యాలెండర్ ఇయర్‌లో టీ20లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డుకు చేరువయ్యాడు. ఈ రికార్డు ప్రస్తుతం విరాట్ కోహ్లీ పేరిట ఉన్నది. 2016లో విరాట్ 31 మ్యాచుల్లో 89.66 సగటుతో 1,614 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ ఘనత సాధించడానికి అభిషేక్‌కు ఇప్పుడు కేవలం 87 పరుగులు మాత్రమే అవసరం. ఈ ఏడాది అభిషేక్ ఈ ఏడాదిలో అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ పరుగులు సాధిస్తున్నాడు. అభిషేక్ 39 టీ20 మ్యాచుల్లో 41.43 సగటుతో 1,533 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో మూడు సెంచరీలు, తొమ్మిది అర్ధ సెంచరీలు సాధించాడు. అభిషేక్ ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగే మూడో టీ20 మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఇరు జట్ల మధ్య ఈ మ్యాచ్ ధర్మశాలలో జరగనుంది. దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో అభిషేక్ పెద్దగా రాణించలేకపోయాడు. కటక్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో అభిషేక్ తక్కువ పరుగులకే అవుటయ్యాడు, కానీ బౌలర్ల బలంతో టీమ్ ఇండియా ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది. న్యూ చండీగఢ్‌లో జరిగిన రెండో టీ20లో అభిషేక్ ఎనిమిది బంతుల్లో కేవలం 87 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇప్పుడు అభిషేక్ మూడో టీ20లో రాణించాలని కోరుకుంటున్నాడు. దక్షిణాఫ్రికాతో మిగిలిన మూడు టీ20లలో అభిషేక్ బ్యాట్ రాణిస్తే.. కోహ్లీని వెనక్కి నెట్టి ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మూడో మ్యాచ్ ఆదివారం ధర్మశాలలో జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది. ఇప్పుడు సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని భారత్ కసితో ఉన్నది. తొలి రెండు మ్యాచుల్లో భారత్ అదే ప్లేయింగ్ ఎలెవన్‌తో ఆడింది. అయితే, టీమ్ మేనేజ్‌మెంట్ తుదిజట్టులో ఏమైనా మార్పులు చేస్తుందా? లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## నితీశ్ రెడ్డి అట్టర్ ఫ్లాప్.. అయినా ఆంధ్ర ఘన విజయం



పుణే వేదికగా పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఆంధ్ర ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ సాధించింది. పంజాబ్ బ్యాటర్లలో అన్మోల్‌ప్రీత్ సింగ్(47) టాప్ స్కోరర్‌గా నిలవగా.. సైల్ ఆరోరా(42), రమణ్‌దీప్ సింగ్(43), హర్నూర్ సింగ్(42) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ రాజు, సౌరభ్ కుమార్, పృథ్వీరాజ్ తలా వికెట్ సాధించారు. మధ్యప్రదేశ్‌పై హ్యాట్రిక్‌తో సత్తాచాటిన నితీశ్ రెడ్డి.. ఈ మ్యాచ్‌లో ఒక్క వికెట్‌కే పరిమితమయ్యాడు.

**హేమంత్ రెడ్డి సూపర్ సెంచరీ..**

206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 19.5 ఓవర్లలో ఛేధించింది. నితీశ్ కుమార్ బ్యాటింగ్‌లో కూడా విఫలమయ్యాడు. రెండు బంతులు ఆడి ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. అతడితో పాటు శ్రీకర్ భరత్(1), అశ్విన్ హెబ్బర్(4), రికీ భుయ్(15) నిరాశపరిచారు. కానీ మర్మరెడ్డి హేమంత్ రెడ్డి సూపర్ సెంచరీతో సత్తాచాటాడు. 53 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 109 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. హేమంత్‌తో పాటు ఎస్డీఎన్వీ ప్రసాద్(35 బంతుల్లో 53 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. ఆంధ్ర తమ తదుపరి సూపర్ లీగ్ మ్యాచ్‌లో డిసెంబర్ 16న జార?ండ్‌తో తలపడనుంది.

## కేకేఆర్ కీలక నిర్ణయం..!

## కెప్టెన్‌గా అతడే?



ఐపీఎల్-2026 సీజన్ వేలానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాబోయో సీజన్‌లో కూడా తమ జట్టు కెప్టెన్‌గా వెటరన్ ప్లేయర్ అజింక్య రహానేను కొనసాగించాలని కేకేఆర్ యాజమాన్యం నిర్ణయించుకున్నట్లు సమాచారం. డిసెంబర్ 16న దుబాయ్ వేదికగా జరగనున్న మినీ వేలానికి కూడా అతడు హాజరు కానున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. గత సీజన్‌లో రహానే కెప్టెన్సీలో కేకేఆర్ దారుణ ప్రదర్శన కనబరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన నైట్‌రైడర్స్ ఏ మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్దానంలో నిలిచింది. అజింక్య తన కెప్టెన్సీ మార్క్‌ను చూపించలేకపోయాడు. దీంతో ఐపీఎల్-2026లో రహానేను కేకేఆర్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని వార్తలు వచ్చాయి. కానీ కేకేఆర్ యాజమాన్యం మాత్రం రహానేకు మరో అవకాశమిచ్చేందుకు సిద్ధమైంది. ఇదే విషయంపై టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

ఈ సీజన్‌లో అజింక్య రహానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించే సూచనలు కన్పిస్తున్నాయి. అదేవిధంగా మరోసారి అతడు కేకేఆర్ జట్టుకు నాయకత్వం వహించే అవకాశముంది. ఎందుకంటే కెప్టెన్సీ సత్తా ఉన్న ఆటగాడు ఎవరూ వేలంలో లేరు. యువ ఆటగాడు రఘువంశీ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. అతడిని వికెట్ కీపర్ బ్యాటర్‌గా ఉపయోగించుకోవాలని కేకేఆర్ భావిస్తుందని బంగర్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

**గ్రీన్‌పై కన్ను..**

కాగా కేకేఆర్ రూ. 64.30 కోట్లు పర్స్‌తో వేలంలోకి వెళ్లనుంది. ఇది అన్ని జట్ల కంటే అత్యధిక మనీ కేకేఆర్ వద్దే ఉంది. నైట్‌రైడర్స్ మొత్తంగా 13 స్థానాలను భర్తీ చేయనుంది. అందులో విదేశీ ఆటగాళ్ల స్థానాలు ఆరు ఉన్నాయి. ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను దక్కించుకునేందుకు కేకేఆర్ ప్రయత్నించే అవకాశముంది. ఈ వేలానికి ముందు కేకేఆర్ రహానే పాటు రింకూ సింగ్, సునీల్ నరైన్, రోవ్‌మన్ పావెల్, వరుణ్ చక్రవర్తి, ఉమ్రాన్ మాలిక్, హర్షిత్ రాణా, అంకుల్ రాయ్, రమన్‌దీప్ సింగ్, అంగ్క్రిష్ రఘువంశీ, మనీష్ పాండే, వైభవ్ అరోరాతో సహా మొత్తం 12 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143